

# నిను 'చూడ' తరమా?


–సామర్ల లక్ష్మీరాజ్

**మూ**ర్తి అమెరికా నుండి అప్పుడే ఫ్లయిట్ దిగాడు. ఇంటి ముందు బ్రహ్మాండమైన ముగ్గు అతనికి స్వాగతం పలికింది. తెగ ముచ్చటపడిపోయాడు. ''ఎంతైనా ఇండియా - ఇండియాయే, తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఎవర్‌గ్రేటే!'' అనేసుకున్నాడు.

సడెన్‌గా అతన్ని చూడగానే తల్లి ఆశ్చర్యపోయింది. ఆ వెంటనే వచ్చి గట్టిగా కావలించేసుకుంది. ''మా నాయనే! నా తండ్రే! వచ్చేవా! నా కంటి వెలుగు, మా ఇంటి దీపం, నా రత్నాలకొండ, రా బాబూ రా! ఎన్ని జన్మలయిందిరా నిన్ను చూసి. కన్న తల్లిని మరిచేవా?! నీ కోసం ఎదురు చూసి చూసి కళ్ళు కాయలు కాసేయిరా! ఎందుకురా అంత దూరదేశాలు పట్టుకు తిరగటం! హాయిగా మనూళ్ళో ఎడ్లబండి తోలుకుని బతకొచ్చుగా! గంజి తాగినా అందులో సుఖం డాలర్లలో వస్తుందటరా ...?'' తల్లి వాగ్దాటికి వులిక్కిపడ్డాడు. మరీ అంత భారీ డైలాగులా?! బహుశా తను వచ్చిన ఆనందంలో మైమరచిపోయిందేమో... సమాధానపడ్డాడు.

''కాఫీ ఇవ్వవే!'' అంటూ ఓ కుర్చీలో కూలబడ్డాడు! ''కిర్.. కిర్... కిర్...'' చప్పుడు వినిపించింది. ''ఏవిటబ్బా!'' అని కిందకు వంగి చూశాడు. మళ్ళీ ఉలిక్కిపడ్డాడు. అది నవాబుల కాలం నాటి కుర్చీ! అతని బరువుని మోయలేక మోస్తూ 'రిథమిక్ సౌండ్' వినిపిస్తోంది.

అప్పుడు చూశాడు హాలు వంక! అంతే! కెవ్వుమని అరిచాడు. అసలా హాలు హాలులానే లేదు. ఓ తాతల నాటి పేము కుర్చీలు, మధ్యలో ఓ కొయ్య




టీ-పాయ్ ... ఓ మూల డబడబ మ్యూజిక్ విని పిస్తూ ఓ డొక్కు ఫేను! మైగాడ్. సోఫాలు, కుర్చీలు, కార్పెట్‌లు ఏమయ్యాయి? అసలది డ్రాయింగ్ రూమేనా లేక పాత సామాన్లు పడేసే గదా...? ఇవి సరిపోనట్టు ... ఓ మూల చెక్క ఉయ్యాల బల్ల! దానికి కాయితం పూలు, రంగు కాయితాలు చుట్టి వున్నాయి. కిటికీలకు, గదులకు చెమ్కీ తెరలు పాత కంపు వాసన కొడుతున్నాయి! గుడ్ గాడ్! మతి పోయింది అతనికి!

''అన్నయ్యా! వచ్చావా! నా బంగారు సోదరా ... నువ్వు లేక ఈ జీవితం ఎడారిలా ఎండిపో యింది. మన 'అనుబంధం' ఎంత కమ్మనిది. నీ రాక ఓ ఏరువాక. మీ గుండెల్లో వెలిగిన చిరుదీపిక!'' ఎట్నెట్రా ఎట్నెట్రాతో ఓ శాల్తీ వచ్చి వాటేసుకుంది. 'ఎవరబ్బా?' అని కళ్ళు నులుముకుని చూశాడు. చెల్లెలు! ముఖాన అరకిలో మందాన పసుపు, జడ వూడొచ్చి పడిపోయేలా మల్లెపూలు, ఓ అయిదు మీటర్ల పైటని కింద నేలను ఊడ్చేస్తూ లంగా, ఓణీలో ప్రత్యక్షమై వుంది. దీనికేమైంది? ఇలా తయారైంది. ''ఏదైనా ఫ్యాన్సీడ్రెస్ కాంపిటీషన్‌కెళ్తు న్నావా?'' అనుమానంగా అడిగాడు.

''ఛ! ఛ! అది కాదు అన్నగారూ! ఇదే కదా మన తెలుగు సంస్కృతి'' అంటూ అనవసరంగా మెలి కలు తిరుగుతూ ఒయ్యారాలు పోయింది.

''శుభ్రంగా పంజాబీ డ్రెస్సు, పోనీ టెయిల్‌తో హాయిగా వుండే దానివి! ఈ బరువేంటే? తీసెయ్ ముందు'' చిరాకు పడ్డాడు.

ఇంతలో అక్కడికి తమ్ముడు వచ్చాడు. బల్లిలా గోడలకు అతుక్కుపోతూ ..... దేక్కుంటూ, పాక్కుంటూ 'అదోలా' వున్నాడు. ''అన్నయ్యా! వచ్చావా! ఎన్నాళ్ళయింది నిన్ను చూసి. జన్మ ధన్యమై పోయింది'' కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. ''హమ్మ య్య! వీడైనా కాస్త తక్కువ మాట్లాడేడు!'' అని నిట్టూర్చాడో లేదో...

''అసలే! అందగాడివి! అమెరికా నీళ్ళు పడ్డట్టు న్నాయి. ఎంత మనోహరంగా ఉన్నావ్‌రా!'' తమ్ముడు అలా తననే రెప్పవాల్చకుండా చూస్తుంటే భయం వేసింది అతనికి. కొంపదీసి వీడు 'హోమో' అయిపోలేదు కదా! డౌటొచ్చింది.

ఇంతలో వాకిట్లో ఏదో 'గోల' వినిపించింది.

> **''అన్నయ్యా! వచ్చావా! నా బంగారు సోదరా ... నువ్వులేక ఈ జీవితం ఎడారిలా ఎండిపోయింది. మన 'అనుబంధం' ఎంత కమ్మనిది. నీ రాక ఓ ఏరువాక. మీ గుండెల్లో వెలిగిన చిరుదీపిక!''**

తొంగిచూశాడు. పని మనిషి ఏడుస్తోంది. వాళ్ళా యన కొట్టాడట! ''దొంగ సచ్చినోడు! వాడి జిమ్మడ! వాడి చేతులిరిగిపోనూ... వాడి దినం జెయ్య! వాణ్ని గోతిలో తొయ్య!'' తిడుతోంది కసిగా నోటికొచ్చినట్టు.

''తప్పు! తప్పు! అలా భర్తని నిందించకూ డదు. భారత స్త్రీకి పతియే ప్రత్యక్షదైవం. కొట్టినా, తిట్టినా పడి వుండాలి. భర్తని గౌరవించాలి. మొగుడు లేని జీవితం వ్యర్థం. నీ భర్తతోనే నీ జీవితం! అందులోనే స్త్రీ జన్మకు సార్థకత!'' 'ఫెమినిస్టు' అని చెప్పుకునే బామ్మ కూడా అనర్గళంగా ఉపన్యాసం దంచేస్తోంది. అది ఇంకా ఎంతసేపు కొనసాగేదో ...

ఈలోగా చెల్లెలు ''అన్నయ్యా! కాఫీ తీసుకో'' అంటూ ఓ చెంబు అందించింది. నీళ్ళనుకుని తాగాడు. నోరు కాలింది. కెవ్వుమన్నాడు. అప్పుడు చూశాడు అది కాఫీ! చెంబుడు కాఫీ! 'ఇంకా నయం! కుడితిపోసే బక్కెట్లో తెచ్చి ఇవ్వలేదు!' నిట్టూర్చాడు.

❋ ❋ ❋

ఆ సలు ఆ రాత్రంతా అతనికి నిద్రే లేదు. ఉయ్యాల ఊగుతున్నట్టు ఓ పందిరి మంచం అటూ - ఇటూ సాగుతుంటే, చిరాగ్గా పక్కంతా దొర్లాడు. పొద్దున్నే అయిదయిందో లేదో తల్లి వచ్చి రాని తెలుగు శ్లోకాలు, అష్టోత్తరాలు వల్లేవేస్తూ - గణగణ గంట మోగిస్తూ పూజ చేసేస్తోంది. దానితో మెళకువ వచ్చేసింది అతనికి.

'హూ! ఖర్మ! ఖర్మ' అప్పటికే ఏ వందోసారో అనుకుని వుంటాడు ఆ మాటని.

గుమ్మం దగ్గర అలికిడి అయ్యింది. తమ్ముడు వచ్చాడు. తెగ మొహమాటపడిపోతూ ... ఏదో ఇబ్బందిలో పడ్డట్టుగా వాడి మొహం చెబుతోంది. ''ఏవిట్రా? ఏమైందీ?'' అడిగాడు తనే! ''నువ్వు అమెరికా వెళ్ళాక 'లత' రెండుసార్లు నీ గురించి అడిగింది అన్నయ్యా!'' అన్నాడు గొప్పగా బాధపడి పోతూ ...

లత తమ్ముడి గర్ల్‌ఫ్రెండ్! ''ఏదో క్యాజువల్‌గా అడిగి వుంటుంది! దానికింత వర్రీ అవుతా వెందుకు?'' అన్నాడు.

''అది కాదు అన్నయ్యా! ఎంతయినా నువ్వు నా కంటే అందంగా ఉంటావు. లత కూడా బావుం టుంది. నన్ను మానేసి నిన్ను ప్రేమిస్తోందేమోనని నా డౌటు! ప్రేమ త్యాగాన్ని కోరుతుంది కదా! లతని నువ్వు పెళ్ళి చేసుకుని నూరేళ్ళు వర్ధిల్లు అన్న య్యా!'' దేవదాస్ లెవల్లో పోజిచ్చాడు.

''ఛట్! వెధవా! నువ్వూ నీ వెర్రి వాగుడూనూ ...! నీ లవర్ని నేను పెళ్ళాట్టమేంటి? అసహ్యంగా వుంది!! ఛీ! ఛీ! బుద్ధి, జ్ఞానం వుండే మాట్లాడు తున్నావా? గెటౌట్!'' గట్టిగా అరిచాడు.

''వీడి కాన్ఫిడెన్స్ ఏమైంది! ఇలా కాంప్లెక్సుతో బాధపడిపోతున్నాడు! ఖర్మ! ఖర్మ!'' జుట్టు పీక్కు న్నాడు అతను. అసలే మూడవుట్‌లో వుంటే 'పెన్' కనిపించలేదు. కొంచెం సేపు వెతికాడు. కాస్ట్లీ పెన్! అమెరికాది! ఎక్కడా దొరకలేదు. ''బాబోయ్! నా పెన్ కనిపించట్లేదు!'' డిక్లేర్ చేశాడు.

అంతే! క్షణాల్లో అతని ముందు ఓ గుంపు తయారైంది. అందరి ముఖాల్లోనూ ఏదో 'కోహి నూర్ వజ్రం' పోయినంత ఫీలింగ్‌లు ... సాలోచ నలు, సమాలోచనల అనంతరం ''ఆ.. అయి డియా!'' అరిచింది చెల్లెలు!

''ఏవిటేవిటి?'' అందరూ ముక్తకంఠంతో

అడిగారు. ''పాకిస్తాన్ ఏజెంట్ ఎత్తుకెళ్ళి వుంటాడు!'' తేల్చేసింది. ''అవునవును! ఇది వాళ్ళ పనే! అసలే అమెరికా అంటే వాళ్ళకు కుళ్ళు కూడానూ! అందుకే వాళ్ళ పెన్ తీసుకెళ్ళిపోయారు!'' తీర్మానించేశారు అందరూ!

అదిరిపడ్డాడు అతను. 'ఇంట్లో పెన్ పోవటమేవిటి? దాన్ని పాకిస్తాన్ వాళ్ళు కొట్టేయటవేవిటి?' తిక్కరేగిపోతోంది అతనికి. వీళ్ళనందరినీ మూకుమ్మడిగా ఏదో పెద్ద పిచ్చికుక్క కరిచింది. అందుకే ఇలా తయారయ్యారు వీళ్ళు జాలిపడ్డాడు అతను.

అంతలో చెల్లెలు ఓ అమ్మాయిని, ఆ పిల్లనే అంటి పెట్టుకుని వున్న ఓ లిల్లీపుట్‌ని తీసుకొచ్చింది. ''ఇదిగో అన్నయ్యా! మన లేడీ డిటెక్టివ్! క్షణాల్లో నీ కేస్ సాల్వ్ చేసేస్తుంది!'' గర్వంగా చూపించింది చెల్లెలు ఆ అమ్మాయిని.

సరిగ్గా చూశాడు అతను. ఆ పిల్ల చిన్నప్పట్నుండి తెలుసు. ఒక పని చేయబోయి ఇంకొకటి చేసేస్తుంది. ఏదీ చేతకాదు! అన్నిట్లోను దూరుతుంది. 'తింగరబుచ్చి' అని ఏడిపించే వాళ్ళు తాము!

''ఈ అమ్మాయి లేడీ డిటెక్టివా!?'' నోరు తెరుచుకుని వుండిపోయాడు. ''మరీ ఆ బుడ్డోడు ఎవరు?'' లిల్లీపుట్‌ని చూపిస్తూ అడిగాడు. ''అతను నా అసిస్టెంట్! కేస్ విషయంలో వివరాలు అవీ సేకరించి హెల్ప్ చేస్తుంటాడు!'' అంది తింగరబుచ్చి కమ్ లేడీ డిటెక్టివ్!!


సదరు లేడీ డిటెక్టివ్‌గారు పెన్ ఎలా పోయిందీ, ఎక్కడ పెట్టిందీ, చివరిగా ఎప్పుడు దాన్ని చూసిందీ ఇత్యాది ప్రశ్నలు వేసి అతడిని వుక్కిరిబిక్కిరి చేసేసింది. ఈలోగా ఆ బుడ్డోడు ఇల్లంతా కెలికేసి, బోర్లించేసి సర్కస్ చేశేశాడు. వాళ్ళ హంగామాకి, హడావుడికి చిర్రెత్తుకొచ్చింది. అప్పటికే ఇల్లంతా కిష్కింధకాండలా తయారైంది.

''ఠాట్! నా పెన్ను నేను వెతుక్కుంటాను. మీ పరిశోధనలు చాలు! గెట్ లాస్ట్!'' కోపంతో ఎగిరాడు.

అంతే! అతని అరుపుకి ఎక్కడి వాళ్ళక్కడ గప్ చుప్!

''ఏవిటో ... వీడికి కోపం మరీ ఎక్కువైపోయింది! ఏరా! విరోచనం సరిగ్గా అవుతుందా?'' బామ్మ ప్రశ్నకు అతని కోపం నషాళానికి అంటింది. ''బామ్మా! నిన్ను మర్డర్ చేసేస్తానే!'' కసిగా అనుకున్నాడు మనసులో...

కాస్త ఫ్రెష్ అవుదామని బాత్రూంకెళ్ళాడు. అక్కడ నిన్న గూట్లో పెట్టిన పెన్ను కనిపించింది. హమ్మయ్య అని నిట్టూర్చాడు.



''ఏం బాబూ? బావున్నావా? ఎప్పుడొచ్చావ్! ఎన్నాళ్ళుంటావ్? అమెరికా ఎలా వుందీ'' అంటూ ఓ స్త్రీ ఎంటరయిపోయింది సీన్లోకి ...! నల్లచీర, నల్ల జాకెట్టు, నల్లబొట్టు, నల్ల గొలుసు, నలుపు రంగు లిప్‌స్టిక్. ఆ వేషధారణ ఓ మంత్రగత్తెలా వుంది. చూస్తూనే జడుసుకున్నాడు! ''మన పక్కింటి ఆంటీరా!'' తల్లి పరిచయం చేసింది.

''హతోస్మి! ఎంత చక్కగా, పొందికగా వుండేది! ఈవిడకేమయిందీ, ఇలా తయారైందీ!'' అనుకున్నాడు అతాడు. ఆవిడ వెళ్ళగానే ''అమ్మా! మన పక్కింటి ఆంటీ ఏదైనా బ్లాక్ మ్యాజిక్ లాంటివి నేర్చుకుంటుందా?'' ఆరా తీశాడు.

''వెధవా! కుళ్ళు జోకులెయ్యకు! ఆ డ్రెస్ ఇప్పుడు లేటెస్ట్ ఫ్యాషన్! గొప్ప క్రేజీ స్టయిల్ అది!'' తల్లి వివరించేసరికి మూర్ఛపోయాడు! ''పగలు చూస్తేనే ఇలా వుంది. ఇక ఆవిడ్ని రాత్రిపూట ఎవరైనా చూసి గుండె ఆగిపోవటం ఖాయం'' అనుకున్నాడు.

అతనికి అంతా అయోమయంగా వుంది! ఆ ఇల్లే కాదు ఆ వీధి - వీధి మొత్తం ఓ వింత లోకంలా వుంది. ఆఖరికి అడుక్కునే బిచ్చగాడు కూడా తమాషాగానే ఉన్నాడు. అసలు వీళ్ళు వీళ్ళేనా? కొంపదీసి తాను వేరే ఖండానికి రాలేదు కదా! లేక యుగాంతమైపోయి మళ్ళీ ఆది మానవులమై పోతున్నామా? అసలు తను తనేనా? కంప్యూటర్ ఇంజనీరేనా? నిజంగానే అమెరికా వెళ్ళొచ్చాడా?' గిల్లి చూసుకున్నాడు. 'ఓర్నాయనో! నాక్కూడా పిచ్చెక్కిపోయేలా వుంది!' జుట్టు పీక్కున్నాడు.

ఆ సాయంత్రం కానీ అతనికి సరైన కారణం దొరకలేదు. సరిగ్గా సాయంత్రం ఆరయింది. అందరూ తెగ సంబరపడిపోతూ, చంకలు గుద్దుకుంటూ టీవీ ముందు సెటిల్ అయిపోయారు. అందులో ఓ సీరియల్ ప్రారంభమైంది. హీరోయిన్‌కి ఏడుపు తప్ప మరో డైలాగ్ లేదు! ఫాదర్ కేరెక్టర్ వచ్చింది. అతని బాధని ఓ అయిదు నిమిషాలు చూపించారు. ఈలోగా అర్థంపర్థం లేని భారీ డైలాగులు! హెవీ ఫీలింగ్స్, ఎక్స్‌ప్రెషన్సూ ...! ఇలా ఆ సీరియల్ పూర్తయిందో లేదో మరో సీరియల్ స్టార్ట యింది. అందులో అన్నగారు, ఓ లవర్ లవ్ సీన్లు! రాజుల కాలం నాటి డ్రెస్సులు వేసుకుని డ్రీమ్ సాంగ్స్. అందులో తమ్ముడు బుగ్గమీద మచ్చ పెట్టుకుని 'అందం' తక్కువైందని ఒహటే ఫీలింగ్. అదో కాంప్లెక్స్. ఎప్పుడూ 'శోకమూర్తి' అవతారమే! పనీ - పాటా లేనట్టు సానుభూతి చూపులు ... సెల్ఫ్ పిటీ ఏడుపొకటీ ...! మధ్యలో అర్థంలేని పాటలు ...

మతిపోయింది అతనికి! ఇది ఇలా ఇంకొన్నాళ్ళు కొనసాగితే ... బాబోయ్ తల్చుకుంటేనే భయం వేసింది. ఆ రాత్రి అతనికి ఓ కల ...

ఆ వీధిలో అందరూ 'వెధవ జీవితం మీద విసుగు చెంది విరక్తితో' ఆత్మహత్య చేసుకున్నట్టు ... భూకంపం వచ్చి మొత్తం ఇళ్ళన్నీ శ్మశానాలు అయిపోయినట్టూ ... ప్రళయం వచ్చి మొత్తం భూమిని ముంచేస్తున్నట్టూ ... ఇలా పిచ్చిపిచ్చి కలలు ...

కెవ్వుమంటూ అరిచి లేచి కూర్చున్నాడు. 'లాభం లేదు! ఏదో ఒకటి చేయాలి! ఈ పీడ వదిలించేయాలి' అనుకున్నాడు. ఆవేశం పొడుచుకొచ్చింది. గబగబా హాల్లోకి నడిచాడు. టీవీ తీసుకుని పెరట్లోకి వెళ్ళాడు. పెట్రోలు పోశాడు. ఓ అగ్గిపుల్ల గీశాడు. అంతే ఆకాశాన్నంటుతూ మంటలు ... వాటి వంక కసిగా చూస్తూ నవ్వాడు. ఏదో కాలుతున్న మంటల వాసనకు ఇంట్లో అందరూ నిద్ర లేచారు. టీవీని తగలబెట్టి చలిమంట కాసుకుంటున్న అతన్ని దిగ్భ్రాంతిగా చూశారు.

అంతే! కెవ్వుమంటూ ఈసారి ఇంట్లో వాళ్ళు వెనక్కి విరుచుకు పడిపోయారు.